## భవనంపై నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అమీర్‌పేట్, జూన్ 8: భవనం మూడో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్‌లోని ధనలక్ష్మి బ్యాంక్ ఎదురుగా ఉన్న 51/3 ఆర్టీ భవనం మూడో అంతస్తు పైనుంచి వ్యక్తి కిందపడి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమారు 55 ఏండ్ల వయసున్న వ్యక్తి భవనాన్ని ఆనుకుని ఉన్న మామిడి చెట్టు నుంచి కాయలను తెంపడం కోసం భవనం పైకి చేరుకుని మామిడి కాయలను తెంపే ప్రయత్నంలో జారిపడి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన వివరాలు ఏమి తెలియరాలేదని, పోస్టుమార్టం నిమిత్తం మృదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్ నగర్, జూన్ 8: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తూ వారికి దక్కాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందకుండా కుట్ర పన్నుతున్నాయని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. దళితులు తమ హక్కులు, చట్టాలను తెలుసుకోనంత కాలం దోపిడీకి గురికాక తప్పదని పేర్కొన్నారు. దళితులకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించినప్పటికీ.. నేటికీ వివక్ష కొనసాగుతున్నదని ఆరోపించారు. నగరంలో మూసీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే దళితులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూన్ 8: ప్రతిఒక్కరూ ఆరోగ్యపట్ల శ్రద్ధ చూపాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటైన జనప్రియ అబోడ్స్ వాకర్స్ క్లబ్ గాంధీనగర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జి.నాగధర్, కె.నిరంజన్, కోశాధికారిగా జి.హరిప్రసాద్‌ను 301 డిస్టిక్ గవర్నర్ లింగ ప్రకాష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. క్లబ్బు నూతన అధ్యక్షుడు జి.నాగధర్ మాట్లాడుతూ తమ క్లబ్ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301కు అనుబంధంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని, పూర్వ గవర్నర్ శ్రీనివాసచారి, కాబోయే డిస్ట్రిక్ట్ గవర్నర్ గంగాధర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి శైలజామోహన్, జనప్రియ అబోడ్స్ కె.మల్లేష్, వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేష్, ఏవీపీ విజయలక్ష్మి, క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



అడ్డగుట్ట, జూన్ 8: చిలకలగూడ దూద్‌బావిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, అమన్ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహమూర్తి, చిలకలగూడ ఎస్ఐ జ్ఞానేశ్వర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. వైద్య శిబిరంలో భాగంగా సుమారు 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, ఆమన్ వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

## తలసానిని సన్మానించిన ఆస్ట్రేలియా తెలంగాణ అధ్యక్షుడు



తలసానిని కలిసిన ఆస్ట్రేలియన్ తెలంగాణ అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్

బన్సీలాల్‌పేట్, జూన్ 8: ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు తలసాని సాయికిరణ్ యాదవ్‌ను ఆస్ట్రేలియన్ తెలంగాణ స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్‌గౌ కలిసి అభినందనలు తెలిపారు. సిడ్నీ నగరంలో తలసానిని కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. తెలంగాణ కీర్తి విశ్వవ్యాప్తమైందని కొనియాడారు. ఆస్ట్రేలియాలోని తెలంగాణ ప్రజలందరూ ఐకమత్యంగా ఉన్నారని, స్వరాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారని రవిశంకర్‌గౌడ్ అన్నారు.

## ఎమ్మెల్యే మాగంటి మరణం తీరని లోటు



మాగంటి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్

కంటోన్మెంట్, జూన్ 8: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాగంటి గోపీనాథ్ మరణం పార్టీకి తీరని లోటని కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరు సంపాదించుకున్న గోపీనాథ్ రాజకీయాల్లో కష్టపడి అంచలంచెలుగా ఎదిగారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు చేశారన్నారు.ప్రజా నాయకుడిగా గోపీనాథ్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడని పేర్కొన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌ను కాపాడడానికి వైద్యులు చేసిన కృషి, పార్టీ తరపున చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మాగంటి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## పద్మశాలి సేవా సంఘం భవనం ప్రారంభం



పద్మశాలి సంఘం కార్యాలయం ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూన్ 8: రాంనగర్ పద్మశాలి సేవా సంఘం నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు కోడం బాలరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం కోశాధికారి కొక్కుల దేవేందర్, ప్రధాన కార్యదర్శి పానుగంటి మురళీకృష్ణ, అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథ, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, సలహాదారులు చెరుపల్లి యాదగిరి, కూరపాటి లక్ష్మినారాయణ ఉపాధ్యక్షులు సత్తయ్య, వెంకటేష్, వల్లకాటి బాబు, కర్నాటి శ్రీనివాస్ కందగట్ల రాజు, శేఖర్ వనం చంద్రమౌళి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య వేడుకల్లో నగరవాసులు..



అయోధ్యలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మణిదీప్

అమీర్పేట్, జూన్ 8: అయోధ్య రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, మధుర కృష్ణ జన్మ భూమి క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ శ్రీనిత్య గోపాల్ దాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మణిదీప్ ఆదివారం స్వామీజీని అయోధ్యలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సనాతర ధర్మ పరిరక్షణలో గోపాల్ దాస్ చేస్తున్న కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా కొనియాడారు. హిందూజాతి భావ జాలాన్ని అణువణువు నింపుకున్న స్వామీజీ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని అన్నారు. స్వామీజీ నిండు నూరేళ్లు జీవించి జాతికి దిశా నిర్దేశం చేసేలా ఆయనకు శక్తిసామర్థ్యాలను అందించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు.

## కాచిగూడ రైల్వే స్టేషన్‌కు లైటింగ్

అంబర్‌పేట, జూన్ 8 : కాచిగూడ రైల్వే స్టేషన్‌కు లైటింగ్ ఏర్పాటు చేశారు. రూ. 2.23 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీన్ని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ఈనెల 9వ తేదీన జాతికి అంకితం చేయనున్నారు. చారిత్రక కట్టడాలకు నూతన శోభను తీసుకువచ్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నిజాంల ఏలుబడిలో 1916 లో 'గోతిక్ శైలి'లో కాచిగూడ రైల్వేస్టేషన్ నిర్మాణం జరిగింది. కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ఉన్న ఈ చారిత్రక నేపథ్యాన్ని నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించడానికి మొత్తం 785 ఇల్యుమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ఈ లైట్ల వెలుగులో కాచిగూడ రైల్వేస్టేషన్ బిల్డింగ్ ఎంతో చూడముచ్చటగా కనిపించనుంది.

## హెచ్‌ఎంఏ వార్షిక అవార్డుల ప్రదానం



హెచ్‌ఎంఏ వార్షిక అవార్డుల కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట్, జూన్ 8: మేనేజ్‌మెంట్, సృజనాత్మకత, డిఫెన్స్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ లాంటి రంగాల్లో అపారమైన సేవలు అందించినందుకుగాను పలువురు అసాధారణ వ్యక్తులు, సంస్థలను హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఏ) తన వార్షిక అవార్డుల పురస్కారాలు అందజేసింది. ఆదివారం అమీర్పేట్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో హెచ్‌ఎంఏ వార్షికోత్సవం జరిగింది. 1965, 1971లలో జరిగిన భారత–పాక్ యుద్ధంలో తన వంతు వీరోచిత పోరాటాలను ప్రదర్శించిన రిటైర్డ్ వింగ్ కమాండర్ ఆవుల భరత్‌భూషణ్ (83)కు హెచ్‌ఎంఏ జీవన సాఫల్య అవార్డును అందించింది. యువత, మహిళల్లో వివిధ శిబిరాల ద్వారా సకాలంలో క్యాన్సర్‌ను గుర్తించి విశేష సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేసిన స్వస్తవ క్యాన్సర్ కేర్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ వాసుదేవ్ చతుర్వేదికి ప్రతిష్ఠాత్మకమైన 'బెస్ట్ మేనేజర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందజేశారు. దేశంలో శరవేగంగా ఎదుగుతున్న ఫిన్‌టెక్ కంపెనీల్లో ఒకటైన జాగిల్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ రాజ్ పి.నారాయణంకు 'ఆంత్రప్రెన్యూర్ ఆఫ్ ద ఇయర్ 2024–25' అవార్డులను అందజేశారు. చిన్న తరహా వ్యాపారవేత్తల్లో పోచంపల్లికి చెందిన చిట్టిమళ్ల పండు అనే యువ వ్యాపారవేత్తను గుర్తించడం ఈ కార్యక్రమంలో ఒక స్ఫూర్తిదాయకమైన అంశంగా నిలిచింది. కార్యక్రమానికి ప్రముఖ వ్యూహాత్మక ఆలోచనల నిపుణుడు, రిటైర్డ్ కమాండర్ మాధవరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అవార్డులు పొందిన వారికి ఇలాంటి గుర్తింపు వల్ల కేవలం సాధించామన్న సంతృప్తి మాత్రమే కాదని, ఇవి తదుపరి తరం నాయకులకు ఒక స్ఫూర్తిని రగిలిస్తాయని చెప్పారు. హెచ్‌ఎంఏ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, నైతిక వ్యాపార అలవాట్లను పెంపొందించడం, భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక వ్యవస్థను బలోపేతం చేయడంలో హెచ్‌ఎంఏ నిబద్ధతను కార్యక్రమం మరోసారి రుజువు చేసిందన్నారు. హెచ్‌ఎంఏ కార్యదర్శి అల్వాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యంత నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన జ్యూరీకి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## అనాథలకు అన్నదానం



అన్నం పొట్లాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జూన్ 8: నగరంలో రోడ్ల పక్కన, ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి అన్నదానం నిర్వహించామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్.వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. ప్రభుత్వం అలాంటి వారికి ఉపాధి, ఆశ్రయం కల్పించాలని వారు కోరారు.

## సైకాలజిస్టులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామచందర్

బేగంపేట్, జూన్ 8: సైకాలజిస్టులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ సమాజంలో మారుతున్న మానసిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు చేయడం అవసరమని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని సూర్య టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో రాంచందర్ మాట్లాడుతూ మానవ సంబంధాల్లో చీలికలు, జీవనశైలి వేగం, ఉద్యోగ ఒత్తిడిలు, వ్యక్తిగత సమస్యలు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో సైకాలజిస్టు పాత్ర ఎంతో అవసరమని అన్నారు. సైకాలజీ రంగానికి గౌరవం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. మార్గ నిర్దేశం, వ్యసనాల నివారణ, ఆత్మహత్య లాంటి యత్నాలు వంటి సమస్యలపై అవగాహన కల్పించడం సైకాలజిస్టుల బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బి.నారాయణరావు, మురళీధర్, రాజు ఆచార్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణ సాహితి, అలియా పర్వీన్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ

ఖైరతాబాద్, జూన్ 8: వాసవీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం లక్డీకాపూల్‌లోని సేవా కేంద్రం ఆడిటోరియంలో విద్యా సహాయ నిధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 400 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు ఎడ్యుకేషనల్ కిట్లను వాసవీ సేవా కేంద్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్పూరు రమేశ్, నాచం ప్రభాకర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా కేంద్రం కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, పూర్వ అధ్యక్షులు ఆలంపల్లి రవి కుమా ర్, జీవితకాలపు ముఖ్య సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, అశోక్ కుమార్, కానసగొట్టు రాజవేఖర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## తనికెళ్ల భరణికి ఎస్పీబీ నటనా పురస్కారం ప్రదానం



తనికెళ్ల భరణిని సత్కరించిన రేలంగి నరసింహారావు, కొండూరి రవి

ముషీరాబాద్, జోన్ 8: కొండూరి భారతి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం జన్మదినాన్ని పురస్కరించుకొని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. 21 మంది గాయనిలు 79 ఏక గళార్చన చేశారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణికి ఎస్పీ బాలు నటనా పురస్కారాన్ని అందించి సత్కరించారు. వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, వినోద్‌బాబు, రామాచారి, సంస్థ అధ్యక్షులు కొండూరి రవి, సురేఖ మూర్తి, శశికళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ

కాచిగూడ, జూన్ 8 : పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని సంఘ సేవకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. విమలాసుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ విజితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కూచి కుళ్ల విమలా సుధాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బర్కత్‌పుర డిపో సమీపంలో జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలు, పండ్లు, బ్రెడ్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులకు మగవాళ్లే వర్ధంతులు, తదితర కార్యక్రమాలు చేస్తారన్న అపోహలను ఆడవాళ్లు కూడా చేస్తారని నిరూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఫౌండేషన్ సెక్రటరీ శ్వేత, సుశీల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో బెంగళూరు కళాకారులు



కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరు కూచిపూడి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువులు లాస్య ఎడార శిష్య బృందం ప్రదర్శనలు అలరించాయి. సాయి రాగ, తేజస్విని, శ్రీ లాస్య, మాన్విత, శాన్వి, అనన్య, సహస్ర, వైష్ణవి, రిత్విక, హర్షితరెడ్డి, సాయి సాన్విక, గౌరీ ప్రదర్శించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకున్నది.

## సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె. నారాయణ

మాదాపూర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ పాలిక్ క్లినిక్ సిటీ స్కాన్ శ్రీసత్య బొల్లి ప్రొఫిలిక్స్‌తో ఈ సిటీస్కాన్ 32–96 స్లైట్స్‌తో సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభించారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కే నారాయణ విచ్చేసి ఫౌండేషన్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చుట్టుప్రక్కల ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్విందర్ బార్గి, కార్యక్రమ కో–ఆర్డినేటర్ నితీశ్, సీఆర్ఎఫ్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కె.నారాయణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, శ్రీసత్య బొల్లి, డాక్టర్ జయం చుక్క, ప్రొ.డి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

## ఫిట్ తెలంగాణ కోసం..



ఆరోగ్యవంతమైన తెలంగాణే లక్ష్యంగా సొసైటీ ఆఫ్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ మార్గ్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవరణలో 3కే, 5కే, 10కే, హాఫ్ మారథాన్ విభాగాల్లో అవగాహన రన్ను నిర్వహించారు. ఈ రన్నుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఒలంపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు ఏపీ జితేందర్ రెడ్డి, డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా మండలి సభ్యులు డాక్టర్ ఎ. రామ్ కిషన్, అవంతిక కన్‌స్ట్రక్షన్ ఎండీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ప్రతినిధులు డాక్టర్ సోమ జగన్ మోహన్ రెడ్డి, పన్నాల హరిశ్చంద్ర రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ తాగూరి, రవి, రాజు, సతీశ్, సునీల్, ఆధిత్యదేవి తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్